


# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం





బుధవారం 17 జూన్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3


# అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం






భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు, నకిలీ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా దాదాపు 24 సంవత్సరాల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బిఎల్ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, నెల రోజల పాటు నిర్వహించే ఓటరు ప్రత్యేక సవరణ డ్రైవ్‌కు సంబంధించిన విధి విధానాలను వివరించారు. జూన్ 25 నుండి నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై, జూలై 24 వరకు నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగు తుందన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి 'హౌస్ టు హౌస్' సర్వే నిర్వహిస్తారని ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన ఫారాలను అందిస్తారని వివరించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని క్షేత్రస్థాయిలోనే 'బిఎల్ఓ యాప్' ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు. ఈ సర్వేలో ప్రధానంగా 2002 నాటికి ఓటరుగా నమోదై, ప్రస్తుతం ఉన్న వారి వివరాలను ధృవీకరిస్తారని, ఒకవేళ 2025 నాటికి ఓటరు జాబితాలో పేరు లేకపోతే, వారిని తల్లి లేదా తండ్రి వివరాలతో మ్యాపింగ్ చేస్తారని స్పష్టం చేశారు. ఓటరు పేరు, తండ్రి పేరు లేదా ఇతర వివరాలు తప్పుగా నమోదై ఉంటే ఈ సవరణల ప్రకారం వాటిని సరిచేస్తారన్నారు. చనిపోయిన వారి పేర్లను, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను జాబితా నుండి తొలగిస్తారని తెలిపారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, వారికి అధికారులు నోటీసులు జారీ చేస్తారని, నోటీసు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా సరైన ఆధారాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సరైన సమాధానం లేదా ఆధారాలు ఇవ్వకపోతే ఓటును తొలగిస్తారని చెప్పారు. తుది డ్రాఫ్ట్ జాబితాలో పేరు నమోదైన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తామని, ఇందులో ఏవైనా లోపాలు కనిపిస్తే సంబంధిత ఆర్డీఓలునోటీసులు జారీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని, కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి లేదా ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చిన వారు తమ అడ్రస్ మార్చుకోవడానికి ఫామ్ 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.ఇందుకోసం ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గుర్తింపు కార్డులను ఆధారాలుగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్ ప్రకటించే నాటికి ఈ ప్రక్రియలన్నీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు.ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితా తయారీకి బిఎల్ఓలు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, ఆర్డీవోలు సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ వి రమేష్, పి వెంకటేశ్వర్లు తహసీల్దార్లు ఏఎల్ఎంటి లు సూపర్వైజర్లు, టెక్నికల్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు వేగవంతమైన సేవలు





భానుపురి/ సూర్యాపేట రూరల్

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, మరియు ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు ఆదేశాలు చేశారు. బాధితులకు ప్రజలకు వేగవంతమైన పోలీస్ సేవలు అందిస్తున్నాము సంఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేస్తున్నామని ఎస్పీ అన్నారు. అర్ధరాత్రి వేళ గ్రామాలలో రాత్రి బీట్ పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ సిబ్బంది సంచరిస్తూ ప్రజలకు ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నారని తెలిపారు. వివిధ సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి వచ్చిన బాధితులతో మాట్లాడి మరి సమస్యలు అడిగి తెలుసుకున్నారు సమస్యలపై సిబ్బంది వేగంగా స్పందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ సందర్శించిన సందర్భంగా పోలీసు విధులపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని త్వరితగతిన స్పందించి న్యాయం చేయాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందించాలని, ముఖ్యంగా సంఘటనల గురించి సమాచారం అందిన వెంటనే బాధితుల వద్దకు వెళ్లి, వారి నివాసాల నుండే ఫిర్యాదులు స్వీకరించి, అక్కడి నుండే కేసులు నమోదు చేసే విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణాను కఠినంగా నిరోధించాలని ఆదేశించారు. జాతీయ రహదారిపై భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు మరియు గంజాయి నిర్మూలనపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ, వాటి ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. రాత్రి సమయంలో విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో భద్రత, రక్షణ కల్పించాలని ఆదేశించారు.విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు చేరువలో ఉంటూ మెరుగైన పోలీసింగ్ అందించాలని తెలిపారు.ఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్, సిబ్బంది ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా దేవరశెట్టి సత్యనారాయణ నియామకము

భానుపురి /హైదరాబాద్

సూర్యాపేట పట్టణానికి చెందిన దేవరశెట్టి సత్యనారాయణ తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ కార్యదర్శిగా నియామకమయ్యారు. మంగళవారం ఈ మేరకు హైదరాబాదులోని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాదిలక్ష్మీనారాయణ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. వీరు గతంలో సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ కోశాధికారిగా, ప్రస్తుతం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధి కొరకు నా వంతుగా కృషి చేస్తానని తెలిపారు. రాజకీయ కమిటీ కార్యదర్శిగా నియామకమైన సందర్భంగా పలువురు మిత్రులు శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు వెంపటి మధుసూదన్ రావు తదితరులు ఉన్నారు.






## విద్యార్థుల విద్య అభివృద్ధికి సరస్వతి విద్యాలయం



భానుపురి /సూర్యాపేట టౌన్

నూతన విద్యా సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ విద్యా నిలయంలో మంగళవారం సరస్వతి హోమం, గాయత్రి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పర్వతం శ్రీధర్ కుమార్ మాట్లాడుతూ,సరస్వతి విద్యా నిలయంలో ఇంగ్లీష్ మీడియం మాధ్యమంగా చిన్నారులకు చక్కటి విద్యతో పాటు సంస్కారం, దేశభక్తి నైతిక విలువలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేలా సంస్కారయుక్త విద్యను అందిస్తామని తెలిపారు. భారతీయ విద్యా తత్వాన్ని అనుసరిస్తూ సంస్కృతి పరిరక్షణ, జ్ఞానంతో పాటు సమాజానికి ఉపయోగపడే తరాన్ని నిర్మించడానికి సరస్వతీ విద్యా నిలయం కృషి చేస్తుందని కావున మా పాఠశాలను ఆశీర్వదించి పాఠశాల అభివృద్ధి కొరకు తోడ్పడాలని కోరారు. చదువులతల్లి శ్రీ సరస్వతి మాత ఆశీస్సులు లభించాలని నిర్వహించిన ఈ యజ్ఞంలో పాఠశాల ప్రబంధ కార్మిణి సభ్యులు కొత్త మల్లికార్జున్,గట్ల సోమయ్య, పోతుగంటిలక్ష్మీనారాయణ, మాడిశెట్టి విజయ కుమార్ ప్రధానోపాధ్యాయులు, కర్పూరం కవిత, ఉపాధ్యాయులు స్వాతి,ప్రియాంక, ఉష,రమ్య,దుర్గ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యువత విద్యార్థులు ఉద్యమించాలి



భానుపురి /హైదరాబాద్

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పోలోజు మహేష్ చారి ఆధ్వర్యంలో బీసీ విద్యార్థి సంఘం నూతన విద్యా సంవత్సర పోస్టర్ ను హైదరాబాదులోనీ బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో మంగళవారం నాడు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేటి యువత సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీఎంబర్స్మెంట్ తో పాటు హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీష్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలంపల్లి సుధాకర్ గౌడ్, బిసి సేన జాతీయ కార్యదర్శి నరాల రుక్మారావు లు పాల్గొన్నారు..

## శ్రీ లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి



భానుపురి/టేకుమట్ల

టేకుమట్ల శ్రీ లింగమంతుల స్వామి చౌడమ్మ తల్లి పెద్దమ్మతల్లి దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్త అన్నారు. మంగళవారం ఆయన చౌడమ్మ తల్లి లింగమంతుల స్వామి పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించారు . ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే శ్రీ లింగమంతుల స్వామి, చౌడమ్మ తల్లి జాతరకు టేకుమట్ల గ్రామం నుంచే కాకుండా పరిసర గ్రామాల నుంచి చుట్టుపక్కల మండలాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో వస్తున్న యాదవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. లింగమంతుల స్వామి ఆశీస్సులతో ఈ ప్రాంతం పాడి పంటలతో అభివృద్ధి చెందాలని అన్నారు. ఆలయం వద్ద నీటి కొరత లేకుండా వుండడం కోసం దాతల సహకారంతో గతంలోనే ఇక్కడ వాటర్ ట్యాంకు నిర్మాణం చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఆలయ అభివృద్ధి కోసం, మౌళిక వసతుల కల్పనకు తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సహకారంతో ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జాల మాణిక్యం, జాల జానకి రాములు, లొడంగి సోమయ్య, జాల వెంకన్న, జాల నరసయ్య, జాల జానయ్య, జాల సైదులు, గ్రామ వార్డు మెంబర్ లు దాసరి శ్రీనివాస్, కాంపాటి రమేష్, దాసరి నర్సయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవ చేయడమే లక్ష్యం





భానుపురి /సూర్యాపేట టౌన్

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ పాలక మండలి కట్టుబడి పనిచేస్తోందని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీధి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాల యంలో ఆమె అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు.సమావేశం ప్రారంభంలో రాష్ట్ర స్థాయిలో 'ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు' అందుకున్న సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీధి, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డిని సభ్యులు అభినందించారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన 12 అంశాలను చర్చించి ఆమోదించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నివేదిత లక్ష్మీధి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం జరిగిన జీరో అవర్‌లో కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పబ్లిక్ హెల్త్ డీఈ రమాదేవిపై పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పనుల్లో వేగం, పర్యవేక్షణ పెంచాలని కోరారు.ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ బైరు శైలేందర్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టర్లు చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.38 వ వార్డు కౌన్సిలర్ గండూరి రమేష్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.42 వ వార్డు కౌన్సిలర్ అంగిరేకుల నాగార్జున మాట్లాడుతూ యూజీడీ కోసం తవ్విన గుంతలు ఆరు నెలలు పూర్తయినా పునరుద్ధరణ జరగలేదని, ప్రజలు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కౌన్సిలర్లు ఫోన్ చేసినప్పుడు అధికారులు స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. 40 వ వార్డు కౌన్సిలర్ కొణతం రాజేష్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో సాంకేతిక ప్రమాణాలు పాటించడం లేదని, ప్రణాళిక లేకుండా మ్యాన్‌హోల్స్ తవ్వుతు న్నారని పేర్కొన్నారు.35 వ వార్డు కౌన్సిలర్ జ్యోతి శ్రీవిద్య మాట్లాడుతూ మొదటి విడతలో చేపట్టిన యూజీడీ పనుల అనంతరం రోడ్ల పునరుద్ధరణ సరిగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.48 వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న మాట్లాడుతూ తమ వార్డు పూర్తిగా వాణిజ్య ప్రాంతమని, యూజీడీ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.16 వ వార్డు కౌన్సిలర్ జహీర్ మాట్లాడుతూ జాకీర్ హుస్సేన్ నగర్, శ్రీనగర్ కాలనీల్లో యూజీడీ పైప్‌లైన్ పనులు పూర్తయినా మ్యాన్‌హోల్స్ నిర్మాణం జరగలేదని, ఇంటర్నల్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు.3 వ వార్డు కౌన్సిలర్ పడిదల సైదులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో నిజమైన నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 18 వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోందని, సూర్యాపేట పట్టణంలో అర్హులైన నిరుపేదలందరికీ పార్టీలకు అతీతంగా ఇండ్ల కేటాయింపులు జరగాలని అన్నారు. అలాగే దోమల నివారణ చర్యలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై అధికారులు స్పందించి దశలవారీగా పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వార్డు నెంబర్ 47 కుమ్మరి కుంట్ల వేణు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో నిరుపేదలకు ఇవ్వడం జరుగు తుంది అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ యం.డి.షఫీ ఉల్లా, మున్సిపల్ ఇఇ కిరణ్,డి.ఇ. ప్రణయ్ కుమార్, టీపీఓ సోమయ్య,మేనేజర్ బుచ్చి బాబు,ఆర్వో కళ్యాణి,పబ్లిక్ హెల్త్ డి ఇ రమాదేవి, అనిల్, యం.డి.గౌసుద్దిన్ ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్ మున్సిపల్ కౌన్సిలర్ లు పాల్గొన్నారు..

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు జూలై 15 వరకు గడువు

**-హైకోర్టు కీలక ఆదేశాలు.. అనుబంధ సౌకర్యాలు యథాతథం**

**-జి.ఓ. 252 సవాల్ పిటిషన్లపై విచారణ.. తదుపరి వాయిదా జూలై 22కు**

భానుపురి /హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది జర్నలిస్టులకు తెలంగాణ హైకోర్టు భారీ ఊరట కల్పించింది. ప్రస్తుతం అమలులో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 జూలై 15 వరకు పొడిగిస్తూ సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది.

**-పిటిషన్లపై విచారణ:**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎంఎస్ నెం. 252, దానికి సంబంధించిన సవరణలను సవాల్ చేస్తూ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్‌తో పాటు పలువురు జర్నలిస్టులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది.పిటిషనర్ల తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వుల చెల్లుబాటును ప్రశ్నించారు. కేసు విచారణ పూర్తయ్యే వరకు అక్రిడిటేషన్‌కు సంబంధించిన అన్ని సౌకర్యాలను కొనసాగించాలని, జర్నలిస్టుల విధులకు ఆటంకం కలగకుండా చూడాలని కోర్టును కోరారు.

**-ప్రభుత్వ వాదన.. కోర్టు ఆదేశం:**

రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్పెషల్ అడ్వకేట్ జనరల్ హాజరై ప్రభుత్వ వైఖరిని ధర్మాసనానికి వివరించారు. ఇరువైపుల వాదనలు విన్న అనంతరం హైకోర్టు, ప్రస్తుతం ఉన్న అన్ని అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటును మరో నెల రోజుల పాటు, అంటే 2026 జూలై 15 వరకు పొడిగించాలని స్పష్టం చేసింది.

**-జర్నలిస్టులకు ఊరట:**

ఈ తీర్పుతో రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావడంతో పాటు, బస్ పాస్, రైల్వే రాయితీ, హెల్త్ కార్డు వంటి అక్రిడిటేషన్‌కు అనుబంధంగా ఉన్న అన్ని సౌకర్యాలను కొనసాగించుకో గలుగుతారు. వృత్తిపరమైన బాధ్యతల నిర్వహణకు ఉన్న అనిశ్చితి తొలగిపోవడంతో మీడియా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**-లెక్కలు బయటపెట్టాలని పిటిషన్**

ఈ కేసులో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ ఒక ఇంటర్‌లాక్యూటరీ అప్లికేషన్ కూడా దాఖలు చేశారు. అక్రిడిటేషన్ కోసం వచ్చిన మొత్తం దరఖాస్తులు, జారీ చేసిన కార్డులు, తిరస్కరించిన దరఖాస్తుల సంఖ్యతో పాటు వాటి తిరస్కరణకు గల కారణాలను కోర్టు ముందు ఉంచాలని ఆయన కోరారు. ఈ దరఖాస్తును తదుపరి విచారణలో ధర్మాసనం పరిశీలించనుంది.

**-"ఇది తాత్కాలికమే.. పోరాటం ఆగదు":**

హైకోర్టు నిర్ణయాన్ని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్ స్వాగతించారు. "జర్నలిస్టులకు ఇది పెద్ద ఉపశమనం. అయితే ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. అక్రిడిటేషన్ విధానంలో పారదర్శకత కోసం, శాశ్వత పరిష్కారం కోసం మా న్యాయపోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.



**-తదుపరి విచారణ జూలై 22న**

ఈ కేసు తదుపరి విచారణను కోర్టు 2026 జూలై 22కు వాయిదా వేసింది. అప్పటి వరకు రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎలాంటి ఆందోళన లేకుండా తమ విధులను నిర్వర్తించుకోవచ్చు. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా మీడియా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. అక్రిడిటేషన్ విధానాలు, వాటి అమలుపై ఉన్న ఆందోళనలను మరోసారి వెలుగులోకి తెచ్చింది.

## విద్యార్థులకు ఎస్పీ నరసింహ సూచనలు

## క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్



భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

నూతన విద్యా సంవత్సరంలో అడుగుపెడుతున్న విద్యార్థులకు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ, శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదువు కోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చెడు అలవాట్లు, డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాకు పరిమితంగా సమయం కేటాయించి చదువుపై దృష్టి సారించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి, తెలియని లింకులు క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు ఎవరికీ పంచుకోవద్దని హెచ్చరించారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, మంచి స్నేహాలతో ముందుకు సాగితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఎస్పీ నరసింహ పేర్కొన్నారు. విద్యార్థుల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

## సర్కారు విద్యార్థులకు బ్రాండెడ్ వస్తువులు

**-నాణ్యమైన వస్త్రంతో యూనిఫాం**

**-తొలిసారిగా జూనియర్ కళాశాల విద్యార్థులకూ అందజేత**

భానుపురి/ హైదరాబాద్



అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులకు 'బ్రాండెడ్' వస్తువులను అందజేయనున్నామని, ఇందుకోసం రూ.687.78 కోట్లు వెచ్చిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం వివరాలు తెలిపింది. "ప్రైవేటు, కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా.. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన వస్త్రంతో యూనిఫాం..బ్రాండెడ్ బూట్లు, సాక్సు, టై, బెల్టులు అందజేయనున్నాం. గురుకుల విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రాండెడ్ బెడ్డింగ్ సామగ్రిని ఇస్తాం. యూనిఫాంతో పాటు స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులు, టై, బెల్ట్, బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా ఇలా ప్రతి దానిలోనూ నాణ్యతకు పెద్ద పీట వేయాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## సూర్యాపేట ప్రభుత్వ హాస్పిటల్ లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

సిపిఐ(ఎం.ఎల్ )మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పాదయాత్రలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ ని సందర్శించి సౌకర్యాలను పరిశీలించి సూపరిండెంట్ ను కలవడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎం.ఎల్ )మాస్ లైన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ సూర్యాపేట జనరల్ హాస్పిటల్ అనేక సమస్యలకు నిలయంగా మారిందని ఆవేదన చెందారు. మున్సిపాలిటీ హాస్పిటల్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా క్షీణించిపోయి దుర్గంధం వెదజల్లుతూ, రోగాలు తగ్గించుకొనుటకు హాస్పిటల్ కి వస్తున్న వారికి కొత్త రోగాలను సృష్టించే విధంగా డ్రైనేజీ వ్యవస్థ తయారయిందని ఆవేదన చెందారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి, మురుగునీరు బయటకు వెళ్లక దోమలు, ఈగలు క్రిమి,కీటకాలకు నిలయంగా మారిందని ఆవేదన చెందారు. దోమల నివారణకు చేసే ఫాగింగ్ను కూడా మునిసిపాలిటీ వారు హాస్పిటల్లో చేయకపోవడంతో దోమలు, ఈగలకు నిలయమైందన్నారు. అదేవిధంగా ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్, వైద్య సిబ్బంది మధ్య కూడా సమన్వయం లోపించి, రాత్రి వేళలో వీధిలైట్లు వెలగక విషపు పురుగులకు సంచారం నిలయంగా మారిందని అన్నారు. కొత్త హాస్పిటల్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో రోగుల సంఖ్య పెరిగిన సందర్భంలో, పడకలు పెంచడం వీలుకాక ఇరుకు గదుల్లోనే రోగులను ఉంచుతున్నారని ఆవేదన చెందారు. హాస్పిటల్ నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆలస్యం చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి కాంట్రాక్టర్ తక్షణమే నిర్మాణ పనులు పూర్తి చేయాలని, అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలకు ఇబ్బంది కలిగించ కూడదని ఆయన హితవు పలికారు. అదేవిధంగా హాస్పిటల్లోనే వివిధ విభాగాలలో తగిన సిబ్బందిని వెంటనే నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరినారు. కార్డియాలజీ విభాగానికి సంబంధించి పరికరాలు అందించి, ఇంతవరకు కార్డియాలజిస్టును నియమించకపోవడంతో ఆ పరికరాలు తుప్పు పట్టి పోతున్నాయి, గుండె జబ్బులతో వచ్చిన వారు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన చెందారు. అదేవిధంగా యూరాలజీ డిపార్ట్మెంట్, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరాలజీ, ఆప్తనీమాలజి, డెంటల్ డిపార్ట్మెంట్లకు సంబంధించినటువంటి సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున హాస్పిటల్ ను చుట్టుముట్టి ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ కొత్తపల్లి రేణుక,పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ పేర్ల నాగయ్య, పిడిఎస్యు రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎర్ర అఖిల్ కుమార్,ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, పట్టణ నాయకులు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



# నేడు పునర్వసు నక్షత్ర మాస కళ్యాణము



భానుపురి /సూర్యాపేట కల్చరల్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత భజన మందిరంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పునర్వసు నక్షత్రం సందర్భంగా మాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు మందిర అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, మందిర ప్రధాన అర్చకులు ధరూరి సింగరాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 కు స్వామివారికి పంచామృత అభిషేకం ఉదయం 11:30 కు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. వివరములకు సెల్:9908359987 సంప్రదించాలన్నారు.

# నిజ జ్యేష్ఠ మాసం బ్రహ్మదేవునికి ప్రీతికరమైన మాసం

భానుపురి/సూర్యాపేట

ఈ మాసంలో తనని ఆరాధించిన వారిని బ్రహ్మదేవుడు సులభంగా అనుగ్రహిస్తాడని. బ్రహ్మదేవుడి ప్రతిమను గోధుమ పిండితో తయారు చేసుకుని ఈ నెల రోజుల పాటు పూజించడం వలన విశేషమైన ఫలితాలను పొందవచ్చని. ఈ మాసంలో చేసే విష్ణుసహస్రనామ పారాయణం అనంత ఫలాన్నిస్తుంది. అలాగే నీళ్ళను దానం చేయడం వలన చాలా ఉత్తమమైన ఫలితాలు దక్కుతాయి. జ్యేష్ఠ శుద్ధ తదియనాడు రంభా తృతీయగా జరుపుకుంటారు. ఈ రోజున ప్రత్యేకంగా పార్వతి దేవిని పూజించడమే కాదు, దానాలకు శుభకాలం. ముఖ్యంగా అన్న దానం చేయడం ఉత్తమం. జ్యేష్ఠశుద్ధ దశమిని దశపాపహర దశమి అంటారు. అంటే పది రకాలను పాపాలను పోగొట్టే దశమి అని అర్థం. పాపాలను హరించే శక్తి కలిగిన దశమి రోజున గంగా స్నానం, లేదా ఏదైనా నదిలో పదిసార్లు మునకేస్తే మంచి ఫలితాన్నిస్తుంది. ఈ మాసం శుక్లపక్ష పాడ్యమి మొదలు దశమి వరకు అంటే తొలి పదిరోజులూ కాశీలోని దశాశ్వమేధఘాట్ లో బ్రాహ్మీ ముహూర్తంలోనే నిద్రలేచి కాలకృత్యాలను తీర్చుకుని గంగానదిలో స్నానం చేయడంతో పాటు గంగానదిని పూజించాలి. అందుకు వీలుకాని వారు సమీపంలోని నది గానీ, లేదా ఇంటిలో గానీ గంగానదిని స్మరిస్తూ స్నానం చేయాలి. నల్ల నువ్వులు, నెయ్యి, పేలాలు, బెల్లం నదిలో వేయాలి. ఈ రోజున ఇష్ట దైవాన్ని పూజించి ఆలయాల సందర్శిస్తే శుభం జరుగుతుంది.జ్యేష్ఠ శుద్ధ ఏకాదశినే నిర్జల 'మతత్రయ' ఏకాదశి అనే పేరుతోనూ పిలుస్తారు. ఏకాదశి వ్రతాన్ని ఆచరించి పెసరపప్పు, పాయసం, పానకం, నెయ్యి, గొడుగు పేదవారికి దానం చేయాలని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. నిర్జల ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే 12 ఏకాదశులను ఆచరించిన ఫలితం దక్కుతుంది. జ్యేష్ఠ శుద్ధ ద్వాదశిని దశహరా అంటారు. ఇది దుర్దశలను పోగొట్టగలిగే శక్తి కలిగిన తిథి. ఈరోజు నది స్నానాలు చేయాలి. అలాంటి అవకాశంలేనప్పుడు ఇంట్లో స్నానమాచరించే సమయంలో గంగా దేవిని స్మరించడం ఉత్తమం. జ్యేష్ఠ పూర్ణిమను మహాజ్యేష్టి అంటారు. ఈ రోజున తిలలు దానం చేసిన వారికి ఆశ్వమేధయాగం చేసిన ఫలితం లభిస్తుంది. జ్యేష్ఠ నక్షత్రంతో కూడిన జ్యేష్ఠ మాసంలో గొడుగు, చెప్పులను అనాధలకు, నిర్భాగ్యులకు దానం చేసిన వారికి ఉత్తమగతులతో పాటు ఐశ్వర్యం ప్రాప్తిస్తాయని విష్ణు పురాణం తెలిపింది. వామన ప్రీతికి విసనకర్ర, జల కలశం, మంచి గంధం దానం చేయాలి. ఈ పౌర్ణమినే ఏరువాక పున్నమి పేరుతో జరుపుకుంటారు. ఇది రైతుల పండుగ.. ఎద్దులను అలంకరించి పొంగలి పెట్టి, ఉరేగింపుగా పొలాల వద్దకు తీసుకెళ్లి దుక్కి దున్నిస్తారు. వటసావిత్రి వ్రతం చేయనున్న మహిళలు జ్యేష్ఠ పౌర్ణమి తర్వాత పదమూడో రోజున మహిళలు వటసావిత్రి వ్రతం చేసుకుంటారు. భర్తలు పది కాలాల పాటు సంపూర్ణ ఆరోగ్యంతో దీర్ఘాయుష్మంతులు కావాలని మనసార కోరుకుంటూ ఈ పూజ చేస్తారు. జ్యేష్ఠ బహుళ ఏకాదశిని యోగినీ 'వైష్ణవ మాధ్వ ' ఏకాదశి, సిద్ధ ఏకాదశి అని కూడా అంటారు. ఈ రోజున ఏకాదశి వ్రతం ఆచరించడం వల్ల అనుకున్న పనులు నేరవేరుతాయి. ఏకాదశి సూర్యోదయం నుండి ద్వాదశి సూర్యోదయం వరకు నీటిని త్యాగం చేసి ద్వాదశినాడు స్నానాదికాలు పూర్తిచేసి, బ్రాహ్మణులకు నీటితోపాటు సువర్ణదానం చెయ్యి. తర్వాత జితేంద్రియులైన బ్రాహ్మణులతో కలసి భోజనం చెయ్యి. శ్రీమహావిష్ణువు నాతో ' లిఏ మానవుడు నన్ను తలచి ఏకాదశి వ్రతం చేస్తారో వారు పాపాల నుండి విముక్తులవుతారు అని తెలియజేశాడు. జ్యేష్ఠ బహుళ చతుర్దశి మాస శివరాత్రి ప్రదోష కాలంలో శివునికి అభిషేకం, బిల్వదళాలతో పూజిస్తే అకాల మృత?యుహరణం, యశస్సు కీర్తి, ఆరోగ్యం లభిస్తుంది. సూర్యుడిని ఆరాధించే 'మిథున సంక్రమణం' వ్యవసాయ సంబంధమైన పనులకు శుభారంభాన్ని పలికే 'ఏరువాక పున్నమి' ఈ మాసంలోనే పలకరిస్తుంటాయి. ఇక దాన ధర్మాలకు అవకాశమిస్తూ విశేష పుణ్యఫలాలను ప్రసాదించే 'జ్యేష్ఠ పౌర్ణమి' శ్రీ మహా విష్ణువు ఆరాధనలో తరింపజేసే 'అపర ఏకాదశి' ఈ మాసాన్ని ప్రభావితం చేస్తుంది. ఏకాదశి వ్రతం చేసిన వారికి స్వర్గం ప్రాప్తిస్తుంది. ఏకాదశి రోజు ఎవరైతే నీటిని కూడా తాగకుండా వుంటారో వారికి ఒక్కొక్క ఏకాదశికి కోటి సువర్ణ ముద్రలు దానం చేసిన పుణ్యఫలం లభిస్తుంది.

# నిబంధనలకు విరుద్ధంగా రసాయన వ్యర్థాలను సిమెంటు ఉత్పత్తిలో






**-ప్రజల ప్రాణాలతో చెలగాటం**

**-మాయ కంపెనీ లీలలు**

**-ఫైవ్ స్టార్ రేటింగ్ కోసం తంటాలు**

**-ఆడిట్ బృందం కంటపడకుండా రసాయన వ్యర్థ లారీ ట్యాంకర్లను దాచిన యాజమాన్యం**

భానుపురి /హుజూర్ నగర్

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం పరిధిలో మేళ్లచెరువు మై హోం సిమెంట్స్ దొంగ దాపరికం మంగళవారం మళ్లీ ఒకటి బయటపడింది. ఈ సిమెంట్ కంపెనీలో నిబంధనలకు విరుద్ధంగా రసాయన వ్యర్థాలను సిమెంటు ఉత్పత్తిలో వినియోగించడం పరిపాటయింది. ఇలాగే మంగళ వారం సాయంత్రం మహా సిమెంట్స్ కంపెనీకి వచ్చిన రసాయన వ్యర్థాల ట్యాంకర్లను దారి తప్పించారు. వేపల మాదారం రోడ్డులో కంపచెట్ల మాటున దాదాపు 20 ట్యాంకర్లను దాచిపెట్టారు. ఇన్నాళ్లు లేనిది ఇప్పుడు దాచటమేంటని అనుకుంటున్నారా అసలు వ్యవహారం ఇప్పుడు చూడండి. ఈ మైహోమ్ సిమెంట్స్ వారు సిమెంటు ఉత్పత్తి కోసం అవసరమైన క్లింకర్ ను మన్నించేందుకు బొగ్గుతోపాటు వ్యర్థ రసాయనాలను వినియోగిస్తుంది. హైదరాబాద్ చుట్టూ ఉన్న ఫార్మా కంపెనీలో రసాయన వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా రప్పిస్తున్నారు. కారణమేదో గాని నిత్యం పదుల సంఖ్యలో ఈ కంపెనీకి రసాయన వ్యర్థాలను తీసుకురావడం కొన్నేళ్లుగా జరుగుతుంది.

**-ఫైవ్ స్టార్ కోసం దొంగ దారులు**

అయితే ప్రజలను నానా విధాలుగా ఇబ్బంది పెడుతున్న ఈ కంపెనీ ఫైవ్ స్టార్ రేటింగ్ కోసం ప్రతి సంవత్సరం పోటీ పడుతుంటది. అందులో భాగంగా ఈసారి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేందుకు ఫైవ్ స్టార్ రేటింగ్ రేసులోకి వెళ్లాలని గట్టిగా ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రయత్నానికి రేటింగ్ ఇచ్చేందుకుగాను అంతర్జాతీయ జాతీయ స్థాయిలో ప్రస్తుతం ఆడిట్ జరుగుతుంది.రెండు రోజులుగా ఈ కంపెనీలో ఆడిట్ జరుగుతుండడంతో ఆడిట్ బృందం కంటపడకుండా ప్రమాదకరమైన ఈ రసాయన వ్యర్థాల ట్యాంకర్లను వేపల మాదారం రూట్ కు మళ్ళించారు. ఈ ఆడిట్ బృందం చుట్టుపక్క పరిసర ప్రాంత వాతావరణాన్ని పరిశీలిస్తుంది. ప్రజా ప్రతినిధులు ఇతర ప్రముఖుల అభిప్రాయాలను సేకరిస్తుంది. ఈ కంపెనీ ద్వారా ఈ ప్రాంత వానికి మేలు జరుగుతుందా లేదా కీడు జరుగుతుందా అనే అంశాలపై లోతుగా అధ్యయనం చేస్తుంది. ఈ అధ్యయనంలో అన్ని సానుకూలతలై వ్యక్తమైతే మాత్రం కంపెనీ యాజమాన్యం లక్ష్యం ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం. కాబట్టి ఈ ప్రాంతంలో ఈ కంపెనీ సాగిస్తున్న దురాగతాలను ఆడిట్ బృందం బహిరంగంగా విచారించాల్సిన అవసరం ఉంది. ఈ కంపెనీకి కొన్నేళ్లుగా వస్తున్న ఫార్మా వేస్టేజ్ ట్యాంకర్ల సంఖ్య వేలల్లోకి చేరింది. ఈ రసాయన వ్యర్థాలను కంపెనీలో మండించడం వల్ల వెలువడే కాలుష్యం ఈ ప్రాంత ప్రజలను క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు గురి చేస్తున్నాయని స్థానిక ప్రజలు ప్రత్యేక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# హుస్నేనాబాద్ కేజీబీవీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

భానుపురి/యాదాద్రి భువనగిరి



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పరిధిలోని హుస్నేనాబాద్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాల (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగిన అడ్మిషన్ల వివరాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని కొత్త అడ్మిషన్లు వచ్చాయని , విద్యార్థినుల హాజరు శాతం ఎలా ఉందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. రిపేర్ పనులు నెమ్మదిగా సాగుతున్న విషయంపై ఆరా తీసిన కలెక్టర్, ఆలస్యానికి గల కారణాలను తెలుసుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.పాఠశాల స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, పప్పు కూరగాయలునాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వంట నూనె ప్యాకెట్లపై ఉన్న గడువు తేదీలను పరిశీలించి, కాలపరిమితి ముగిసిన వస్తువులు వినియోగించరాదని సూచించారు.పాఠశాల ఆవరణను పరిశీలించిన కలెక్టర్, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, చెత్తాచెదారం పేరుకుపోకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 11వ వార్డులో నీటి సమస్య పరిష్కరించిన చైర్ పర్సన్ బాలమణి



భానుపురి/యాదాద్రి భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో ని 11వ వార్డులో నీటి సమస్య ఉన్నదని కౌన్సిలర్ జూకంటి సంపత్ తెలిపిన వెంటనే మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ స్పందించి నవజీవన్ బీడీ కంపెనీకి ఎదురుగా ఉన్న ఖాళీ బోర్ నందు కొత్త మోటర్ ఏర్పాటు చేయించి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 11 వార్డు కౌన్సిలర్ జూకంటి సంపత్, మాజీ కౌన్సిలర్ జూకంటి శ్రీకాంత్, జూకంటి రమేష్ మున్సిపల్ సిబ్బంది రాజు, సురేందర్ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బూర్జు బావి గ్రామంలో మహిళా సంఘం భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

భానుపురి/యాదాద్రి భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బూర్జు బావి గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం అందించే లక్ష్యంతో నిర్మించనున్న మహిళా సంఘం భవనానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న లబ్ధిదారులు గ్రామ సర్పంచ్ వల్లాల వాసవి రమేష్ నూతనంగా నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమంలో కూడాఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. గృహప్రవేశ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను అభినందించి, వారికి పట్టుబట్టలు అందజేయడంతో పాటు యాటపొట్టేళ్ల కార్యక్రమానికి ఆర్థిక సహాయం కూడా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నామని, మహిళా సంఘం భవనం నిర్మాణం ద్వారా గ్రామ మహిళలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు వివిధ సామాజిక కార్యకలాపాలకు ఒక వేదిక అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కల సాకారం అవుతోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు



కల్పించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.